

ఎస్‌టిఐసి ఆశాజ్యోతికి అవార్డు

ప్రజాశక్తి - పెరవలి



కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టిబి యూనిట్‌లో ఎస్‌టిఐసిగా విధులు నిర్వహిస్తున్న వి.ఆశాజ్యోతి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డును అందుకుంది. శ్రీ సాయి ప్రాపర్టీస్ అండ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ సంస్థ వారు వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన మహిళలను గుర్తించి ఈ అవార్డులను బుధవారం అందించారు. ఆశాజ్యోతి సేవలను గుర్తించి ఆమెకు అవార్డును అందించారు. ఇందులో భాగంగా ఆమెను సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో తణుకు టీం మేనేజర్ సత్యనారాయణ, పసుపులేటి నాగేశ్వరరావు మహిళలు పాల్గొన్నారు

మార్జిన్లు మాయం

రోడ్డు చెంతనే అక్రమంగా నిర్మాణాలు
చిరు వ్యాపారులకు అద్దెకిస్తూ జేబులు నింపుకుంటున్న వైనం
ప్రయాణికుల పాట్లు... పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కడియం

కడియంలో రోడ్డు మార్జిన్లు మాయమయ్యాయి. కొంత మంది అక్రమార్కులు రోడ్డు వెంబడి మార్జిన్లను ఆక్రమించి నిర్మాణాలు సాగించారు. అంతేకాకుండా చిరువ్యాపారులకు వీటిని అద్దెకిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఆక్రమణల ఫలితంగా రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ప్రతి రోజూ పలువురు జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ మార్గం గుండా ప్రయాణించినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

రోడ్డు మార్జిన్లు ఆక్రమించడం, అందులో తాత్కాలికంగా రేకుల షెడ్డులు నిర్మించడం, పంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించడం, కొన్నాళ్లపాటు చిరు వ్యాపారం నిర్వహించి ఆ తర్వాత ఆ స్థలాన్ని అద్దెకివ్వడం నెల నెలా అద్దెతో జేబులు నింపుకోవడం కడియంలో పరిపాటిగా మారింది. ముఖ్యంగా కడియం కెనాల్ రోడ్డులో బస్టాండ్ నుంచి దేవీచౌక్ సెంటర్ మీదుగా వెంకటేశ్వరస్వామి గుడి వరకూ, అలాగే దేవీచౌక్ సెంటర్ నుంచి హైస్కూల్ రోడ్డు భాస్కర సెంటర్ వరకూ, బొబ్బిలి బ్రిడ్జి సెంటర్ నుంచి బుర్రిలంక రోడ్డులో పిల్లకాలువగట్టు వరకూ ఆక్రమణలకు గురయ్యాయి. ఆర్ అండ్‌బి, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన జాగా కనిపిస్తే పాగా వేసేస్తున్నారు కొందరు ఆక్రమణ దారులు. ఆనక పక్కా నిర్మాణాలు చేపట్టి వేలకు వేలు అద్దెలు వసూలు చేసుకుంటూ దర్జాగా కాలం గడిపేస్తున్నారు. అవసరం ఉన్నంత మేరకు రోడ్డు మార్జిన్లు ఆక్రమించేశారు. చివరకు డ్రెయినేజీలను వదలట్లేదు. దీంతో డ్రెయినేజీ పూడుకుపోయి మురుగు నీరు పారక తీవ్ర దుర్వాసన రావడంతో పాటు కొద్దిపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయి. ఈ రోడ్ల వెంబడి చిరువ్యాపారాలతో పాటు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు, మద్యంషాపులు, దేవాలయాలు, నివాసప్రాంతాలు , సినిమా హాళ్లు ఉన్నాయి. ఆక్రమణలతో రోడ్డు కుచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



ఆక్రమణలతో ఇరుకుగా మారిన రోడ్డు

ఆక్రమణకు కొత్తరకం ఎత్తుగడ

ఈ రోడ్డు సమీపాన సొంత స్థలాలు, ఇళ్ల గలవారిలో కొందరు కోటీశ్వర్లు తమకున్నటువంటి దస్తావేజులను సాకుగా చూపిస్తూ మార్జిన్లను ఆక్రమిస్తూ యథేచ్ఛగా పక్కా భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మించారని, అవి నేటికీ కొనసాగుతున్నాయని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం, స్థానికుల నుంచి అభ్యంతరాలు వచ్చినా అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లకిరువైపులా మార్జిన్ల రూపంలో ఉన్న లక్షల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమణదారుల చెరనుండి విడిపించాలని, ఆక్రమణలు జరగకుండా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ప్రజలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు , సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

డీవార్మింగ్ డేను జయప్రదం చేయాలి

డిఎంహెచ్‌ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 14, 18 తేదీల్లో నిర్వహించే నులిపురుగుల నివారణ(డివార్మింగ్ డే) దినోను విజయవంతం చేయాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక నారాయణపురం పిహెచ్‌సిని ఆయన పరిశీలించారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగు నివారణకు వైద్యాధికారులు, సిబ్బందికి ప్రజలు, పాఠశాల విద్యార్థులు సహకరించాలన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమములో భాగంగా నేడు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇన్‌స్టిట్యూషన్, యుపిహెచ్‌సిలలో లైంగిక వేధింపులకు గురైన వారిపై చర్యలు తీసుకునే విధంగా ఆరుగురు సభ్యులతో కూడిన ఇంటర్నల్ కంప్లైంట్ సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో డిఎల్ఎటిఒ డాక్టర్ ఎన్.వసుంధర, ఇన్‌ఛార్జి డిఐఒ డాక్టర్ జి.వరలక్ష్మి, డిఎఎంఒ డాక్టర్ పి.లక్ష్మీదేవి, పిఎంఒ పి.వీరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎ.రజియాఅహ్మద్, జూనియర్ అసిస్టెంట్ ఎం.మంజూరెడ్డి సభ్యులుగా ఉంటారన్నారు. ఫిర్యాదులు స్వీకరణ అనంతరం కమిటీ స్పందించి తగు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని కలెక్టర్ మాధవీలత శుభాకాంక్షలు తెలియ జేశామన్నారు. ఈనెల 1 నుంచి నేటి వరకు నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాల్లో విజయవంతంగా నిర్వహించా మన్నారు. పిసిపిఎన్‌డిటి యాక్టు, మహిళల హక్కులు అంశాలపై రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, జిల్లాలోని మరికొంత మంది ప్రముఖులతో వీడియో చిత్రీకరణ చేసి ఆంధ్ర ఈస్ట్ గోదావరి ట్విట్టర్‌లో పోస్టు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో ఇన్‌ఛార్జి ఎన్.సత్యకుమార్, ఎంఎంహెచ్‌ఇఒ నాగు, సిసి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రంలో మహిళలకు ఉచిత వైద్య సేవలు



ఆసుపత్రి డైరెక్టర్ రతీదేవి

ప్రజాశక్తి -నల్లజర్ల

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31 వరకూ ఏలూరులోని తమ ఆశ్రం ఆసుపత్రిలో మహిళలకు ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నామని అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఆశ్రం ఆసుపత్రి) డైరెక్టర్ జి.రతీదేవి తెలిపారు. నల్లజర్ల విచ్చేసిన ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడారు. కుటుంబసభ్యులందరినీ కంటికి రెప్పలా కాపాడుకునే ఇల్లాలు తన ఆరోగ్యం పట్ల మాత్రం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. సాటి మహిళగా ఆలోచించి స్త్రీల ఆరోగ్యంపై దృష్టి సారించానన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 1వ తేదీ నుంచి 31 వరకూ తమ ఆసుపత్రిలో మహిళల కోసం ప్రత్యేక ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్‌బిఎస్, సీరం క్రియేటైన్, హెచ్‌బి, టిసి, డిసి, ఇఎస్‌ఆర్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, పాప్ స్మియర్ తదితర రక్త పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. గర్భిణులకు మూడో నెల నుంచి తొమ్మిదో నెల వరకూ వైద్యుల సలహాలు సూచనలతో పాటు వారికి ఉచితంగా ఐరన్, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ వంటి మందులు, రాగి పౌడర్, పోషకాహార కిట్లు స్వచ్ఛందంగా అందజేస్తున్నామన్నారు. గర్భిణుల కోసం ప్రతి నెలా 9వ తేదీన నల్లజర్ల, పోతవరం పిహెచ్‌సి కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్యాంపుల్లో గుర్తించిన ఆర్థికంగా వెనుకబడిన వారికి స్కానింగ్, అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా తమ ఆసుపత్రిలో చేస్తున్నామన్నారు. వీరి రాకపోకల కోసం ఉచిత బస్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా తమ ఆశ్రం ఆసుపత్రిలో గర్భిణులకు అన్ని వేళలా ఉచితంగానే కాన్పులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కరాటేలో కడియం విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి- కడియం

విశాఖపట్నంలో జపాన్ షాట్ కాన్ సంస్థ అధ్వర్యంలో జరిగిన నేషనల్ కరాటే పోటీల్లో కడియం విద్యార్థులు పతకాల పంట పండించారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. కె.లోకేష్, బి.కుమార్ రాజా, జి.దివ్యశ్రీ, కె.పర్ణిక, ఆర్.ఆదిత్య ప్రథమ స్థానంలో స్వర్ణ పతకాలు సాధించగా కె.హర్షిత కావ్య సిహెచ్. చైతన్య, కే.వినయ్, ఆర్.రోహిత్ ద్వితీయ స్థానంలో వెండి పతకాలు పొందారు. జి.సంవిత, యు.వీర సాయి, ఆర్.కౌశిక్ తతీయ స్థానంలో కాంస్య పథకాలు సాధించారని కోచ్ కొప్పిశెట్టి జానకిరామ్ తెలిపారు. వీరిని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు నాని అభినందించారు.



విజేతలతో ఎంపిపి ప్రసాద్ తదితరులు



చందనను సత్కరిస్తున్న తాడాల తదితరులు

చందన , జక్కంపూడిలకు సత్కారం

ప్రజాశక్తి -కడియం

ఇటీవల రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ ఛైర్మన్‌గా నియమితులైన చందన నాగేశ్వర్, పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా నియమితులైన జక్కంపూడి గణేష్‌లను జెసిఎస్ ఇన్‌ఛార్జి తాడాల చక్రవర్తి బుధవారం ఘనంగా సత్కరించారు. వారి ఇరువురిని తాడాల మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలు అందించారు. దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విష్ణు, గొందేశి శ్రీనివాసరెడ్డి, ముద్దాల అను, దేవులపల్లి సరితారాణి, బి.కామేశ్వరరావు తదితరులున్నారు.

విద్యతో అసమానతలు దూరం

కడియం : విద్య అసమానతలు దూరం చేస్తుందని, కష్టాల్లో ఉంటే కుంగిపోకూడదని, పేదరికం చదువుకు ఆటంకం కారాదని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. తన తండ్రి గొల్లపల్లి మూలయ్య 12వ వర్ధంతి సందర్భంగా కడియం బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని బుధవారం అందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న పదో తరగతి విద్యార్థిని శిరీషకు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి వీరసత్యనారాయణ పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పడాల సుదర్శన, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం జిల్లాలో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా సదస్సులు, సభలు, సమావేశాలు నిర్వహించారు. పలు రంగాల్లో సేవలందించిన మహిళామణులను ఘనంగా సత్కరించారు. కేకులు కట్ చేసి పంచారు. **రాజమహేంద్రవరం** ఆనం కళా కేంద్రంలో జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ ఛైర్మన్ సంకిస భవానీప్రియ, మహిళా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవీలతను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ఎవరికీ తక్కువ కాదు అనే ఆలోచనలో మహిళలు ఉండాలన్నారు. స్త్రీ లేకపోతే ఈ జగతి లేదన్నది వాస్తవం అన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాను ముందుండి నడిపిస్తున్న కలెక్టర్ మాధవీలతన అందరికీ ఆదర్శనీయమన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు పాలనను ఎంతో చాకచక్యంగా నడిపిస్తున్నారన్నారు. లింగ వివక్ష లేకుండా సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రోజులుగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, డిఆర్‌డిఎ పీడీ ఎస్.సుభాషిణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఎన్.వసుంధర తదితరులు పాల్గొన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్‌టిజి. సత్యగోవింద్, ఆర్‌డిఒ మల్లిబాబు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.




ధవళేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న చందన దంపతులు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి ఆధ్వర్యంలో మహిళా జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళల హక్కులు, బాధ్యతల గురించి ప్రత్యూషకుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక మహిళా కారాగార సూపరింటెండెంట్ వసంతకుమారి, కారాగార సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రాజమహేంద్రవరం హరిత దళం ఎన్‌జిఒ సహకారంతో వేస్ట్ పిక్కర్ మహిళల కోసం స్థానిక సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. **గోకవరం** ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి దాసరి శ్రీరంగ పాల్గొన్నారు. మహిళలకు అందరకూ గౌరవం ఇవ్వాలన్నారు. కేకును కట్ చేసి మహిళలకు పంచారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ మీరాబి, సర్పంచ్ కె.శ్రావణి పాల్గొన్నారు. **ధవళేశ్వరం** సచివాలయం-3 కన్వీనర్ కళ్యాణిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డాక్టర్ వర్ధిని దంపతులు పాల్గొన్నారు. ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా విశ్రాంత ఉద్యోగులు బండారు లక్ష్మి, దువ్వూరి సుబ్బలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. దాసరి సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యర్రమోతు ధర్మరాజు మాట్లాడారు. ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఘనత బండారు లక్ష్మికే దక్కిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శివానంద పబ్లిక్ స్కూల్‌ను స్థాపించి ఎంతో మందికి విద్యా దానం చేస్తున్నారన్నారు. సుబ్బలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయిని, పీడీగా విశిష్ట సేవలందించారన్నారు. ఎందరో విద్యార్థులను క్రీడల్లో జాతీయ స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరి కామేశ్వరశర్మ, బండారు శ్రీనివాస్, కొండా సూర్యనారాయణ, కె.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విలేజ్ ఆర్గనైజర్లు, అసిస్టెంట్లు పాల్గొన్నారు అనంతరం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉపాధ్యాయురాలు ఎం.జయ శ్రీలక్ష్మి హాజరై మాట్లాడారు. ఎపిఎం ఎన్.మంగాయమ్మ, మండల సమాఖ్య ప్రతినిధి చదలవాడ మరియమ్మ, కోశాధికారి డొక్కు లక్ష్మీపార్వతీ పాల్గొన్నారు. **కడియం** మండలం కడియపులంకలో మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. 13 వార్డు సభ్యురాలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బోడపాటి రాజేశ్వరి పాల్గొని కార్మికులను సత్కరించి, స్వీట్లు అందించారు. రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతలో మహిళా కార్మికుల కృషి ఎనలేనిదన్నారు. కరోనా సమయంలో వీరు చేసిన కృషి మరువలేనిదన్నారు. **సీతానగరంలో** సిపిఐ(ఎంఎల్) పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు పలివెల జ్యోతి మాట్లాడారు. మహిళా ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. బాలికలపై పలుచోట్ల వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. **తాళ్లపూడి** మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో, ఎస్‌ఐ కెవి రమణ ఆధ్వర్యంలో బల్లిపాడు కాకర్ల కళ్యాణ మండపంలో మహిళా దినోత్సవాలను నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. మానవతా మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు. ఎస్‌ఐ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు కొవ్వూరు డిఎస్పి వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. **దేవరపల్లి** మండలం యాదవోలులో ఐటిసి కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తమ్మిరెడ్డి నాగప్రసన్న, కె.హారికజ్యోతిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం ప్రసాదు, దేవరపల్లి మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ముస్తఫా, ఆశాలు, అంగన్‌వాడీలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎంపీ భరత్, రుడా ఛైర్మన్ షర్మిళారెడ్డి తదితరులు

కార్టూ'నిజం'



పనైపోయిందని.. ఎక్కడో పారేశారంట యువరానర్..!!

పలు కుటుంబాలకు జక్కంపూడి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇటీవల మతి చెందిన వారి కుటుంబాలను, ప్రమాదంలో గాయపడిన వారిని బుధవారం రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా పరామర్శించారు. వంగలపూడిలో చవ్విడి చిట్టియ్య, కాజా చంటబ్బాయి, చిక్కాల సూరిబాబు, పట్నాల కిట్టయ్య భార్య రమణమ్మ, తాడివలస అప్పారావు, సిగిరిపల్లి వెంకన్న కుమారుడు యేసు ఇటీవల మతి చెందారు. ఎంఎల్‌ఎ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వంగలపూడిలో మట్టా వెంకయ్యమ్మ కుమార్తె మట్టా శర్వాణి ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటోంది. ఆమెను ఎంఎల్‌ఎ పరామర్శించారు. రామచంద్రపురంలో ఇటీవల కాలంలో మతి చెందిన చంటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతిని తెలియజేశారు. నాగంపల్లి ఎంపిటిసి సభ్యులు బి.లక్ష్మి భర్త బి.గంగాధర్ బుధవారం ఉదయం మతి చెందారు. ఆమెను పరామర్శించారు, గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా

రూ.10 లక్షల పనులకు ఎంపిపి శంకుస్థాపన

ప్రజాశక్తి -గోకవరం

గోకవరంలో రూ.10లక్షల పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఎంపిపి సుంకర శ్రీవల్లి బుధవరం శంకుస్థాపన చేశారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు గోకవరం గ్రామంలో బాలు వారి వీధిలో ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగరమేష్, వైస్ ఎంపిపిలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు, సర్పంచ్ కొమరం శ్రావణి, వైసిపి నాయకులు సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రమ్యశ్రీ, క్రిస్టియన్ మైనార్టీ డైరెక్టర్ వరసాల కుమారి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపిపి, జడ్‌పిటిసి

అక్షయ్ రామ్ వైద్యం కోసం సాయం

ప్రజాశక్తి -గోకవరం

అనారోగ్యంతో బాధపడుతూ చెన్నయ్‌లోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి అక్షయ్‌రామ్‌కు గోకవరంలోని పేదల కోసం పేదల సంఘం అధ్యక్షులు వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.35 వేల నగదును పాలూరి బోసుబాబుకి స్థానిక రమా సత్యనారాయణ ఆలయం వద్ద బుధవారం అందజేశారు. అలాగే గోకవరానికి చెందిన 1993-94 ఏడాది పదోతరగతి బ్యాచ్ విద్యార్థి కరాసు శివరామకృష్ణ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందించారు.

అగ్నిప్రమాద బాధితులకు చందన పరామర్శ

ప్రజాశక్తి- ధవళేశ్వరం

ధవళేశ్వరం గ్రామం సుబ్బయమ్మపేటలో అగ్నిప్రమాద బాధిత కుటుం బాన్ని వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ బుధవారం పరామర్శించారు. ఈ అగ్నిప్రమాదంలో సిద్దనాటి బాపనమ్మ గహం పూర్తిగా దగ్ధమైంది. భర్త చనిపోవడంతో ఆమె ఒంటిరిగా ఉంటోంది. నిర్వాసితులైన ఆమెను చందన పరామర్శించారు. నగదు సహాయం తోపాటు నిత్యావసర వస్తువులను అందించారు. ఆమె నివాసం ఉండేందుకు తాత్కాలికంగా షెడ్ నిర్మించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎన్‌వి.శేఖర్, కన్వీనర్ తలారి ప్రసాద్, గూటం రాజు, నంబూరి రవి, పి.రాజేష్, పి.జయప్రసాద్ పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న చందన

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -గోకవరం

నిరుద్యోగ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించి అభివద్ధి చెందాలని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ అన్నారు. బుధ వారం గోకవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ అవరణలో గుర్రాల ధర్మేంద్ర ఏర్పాటు చేసుకున్న చెరకు రసం షాప్‌ను పాస్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వరసాల ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యక్తిగతంగా స్వయం ఊపాధిపై దృష్టి సారించి ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ రామన్న, మాజీ సర్పంచ్ ఇ.చినబాబు, జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ, మందపాటి సతీష్, గుర్రాల ధర్మేంద్ర గుర్రాల నాగేశ్వరరావు హర్ష పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



పట్టుబడ్డ రేషన్ బియ్యం లారీతో అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం నుంచి కాకినాడ వైపు రేషన్ బియ్యం లోడుతో వెళుతున్న లారీని ఆలమూరు మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు లోని ఎస్.మలుపు దాటిన తరువాత స్పెషల్ బ్రాంచ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పి సిహెచ్.సుధీర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖకు అప్పగించారు. దీంతో ఎంఎస్ఒ టి.సుబ్బరాజు ఆ బియ్యాన్ని రేషన్ బియ్యంగా నిర్ధారించారు. దీంతో తూకం వేసిన 910 బస్తాల బియ్యాన్ని మండపేట ఎఫ్‌సిఐ గోదాముకు తరలించారు. ఆ లారీలో సుమారు రూ. 19.20 లక్షలు విలువైన దాదాపు 23 టన్నుల రేషన్ బియ్యంగా అధికారులు నిర్ధారించారు.

లారీ సీజ్.. డ్రైవర్ అరెస్ట్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని ఆలమూరు పోలీసులు సీజ్ చేసి డ్రైవర్ బత్తుల ధనరాజును అరెస్ట్ చేశారు. అక్రమ బియ్యం రవాణా సూత్రదారులపై ఆరా తీస్తున్నారు. ఈమేరకు స్థానిక ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో బాధితుడు

స్క్రూ డ్రైవర్‌తో దాడి - వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మండపేట

వేములపల్లి గ్రామ శివారు దూకుడుమెట్ట వద్ద ఒక వ్యక్తి మరొక వ్యక్తిపై స్క్రూ డ్రైవర్ తో దాడి చేశాడు. ఈ దాడిలో అతడు మృతి చెందాడు. బుధవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన బండి శివ (42)పై అదే గ్రామానికి చెందిన హరీష్ ఇద్దరు కలిసి మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు వేములపల్లి శివారులో మద్యం తాగారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య పాత గొడవలు ఘర్షణకు దారి తీసి శివపై హరీష్ స్క్రూ డ్రైవర్ తో దాడి చేసి, అతని తలలో స్క్రూ డ్రైవర్ గుచ్చి అక్కడ నుంచి పరారయ్యాడు. బుధవారం ఉదయం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శివను చూసిన స్థానికులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ శివ గణేష్, ఎస్ఐ శివకష్ణ పరిశీలించి అతనిని 108 సహాయంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా అక్కడికి చేరుకునే సమీపంలోనే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఎస్ఐ శివకష్ణ కేసు నమోదు చేయగా సిఐ శివ గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నగర్ శివారులోనగర శివారులో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కష్ణ భగవాన్ తెలిపారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు నగరంలో విస్తత దాడులు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా నగరంలో వెంకటేశ్వర నగర్ శివారు ముద్దుల లక్ష్మి గోడౌన్ వద్ద కొందరు వ్యక్తులు గంజాయి కలిగి ఉన్నట్లు అందిన సమాచారం ప్రకారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వీరిపై త్రీ టౌన్ లో డిసి షీట్ ఓపెన్ చేశామని పోలీసులు తెలిపారు.నగరంలో ఎటువంటి గంజాయి మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్లు తెలిసిన సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

దాడి చేసిన వారిపై కేసు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామంలో చేతబడి చేస్తున్నాడంటూ వ్యక్తిపై దాడి చేయడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. దీనిపై పోలీసుల వివరాల మేరకు ఈనెల 2న నీలాద్రి పేట గ్రామ శివారు వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్న పసగొడుగుల చినబాబురావు చేతబడి చేస్తున్నాడనే ఉద్దేశంతో అతని తమ్ముడు పసుగొడుగుల శ్రీనువాసు మరి కొంతమంది అతని ఇంటికి దౌర్జన్యంగా వెళ్లి అతనిపై దాడి చేసి గాయపరిచారు. అతను వైద్య నిమిత్తం కాకినాడ వెళ్లి వైద్యం చేయించుకుని బుధవారం అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని జగ్గంపేట బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్ఐ వై. గణేష్ కుమార్ పరిశీలించి ఆ ఇంటి చుట్టుపక్కల కాలనీలో నివసించే వారికి మూఢనమ్మకాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు.

మతిస్థిమితం లేని మహిళను కాపాడిన కానిస్టేబుల్

ప్రజాశక్తి- ధవళేశ్వరం


మతిస్థిమితం లేని మహిళ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో గోదావరిలో పడిపోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న బ్లూకోట్ కానిస్టేబుల్ %ూజ% 1210 డి.శ్రీనివాస్ ఆమె గోదావరిలో పడిపోయినట్లు తెలియగానే వెంటనే అక్కడకు వెళ్ళి అక్కడ ఉన్న వారి సహాయంతో ఆమెను రక్షించి, ఆమె యొక్క వివరాలు అడిగి, ఆమె పేరు అయినవిల్లి.రాజేశ్వరి, భర్త శ్రీహరి, 30 సం.లు, కుతుకులూరు అని తెలియడంతో, సదరు విషయం ఆమె తాలూకా వారికి తెలియపరచగా వారు వచ్చిన తర్వాత ఆమెను వారికి అప్పగించారు. ఆమెకు మతిస్థిమితం లేనట్లు తెలిసింది. ఆమెను కాపాడిన కానిస్టేబుల్ ను అధికారులు అభినందించినారు.

'అశోక' విలాపం ఇప్పుడెందుకు..?

ఎంపీ మార్గాని భరత్ రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

'మీరు అధికారంలో ఉన్నారు.. కేంద్ర మంత్రిగా పనిచేశారు.. అప్పుడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించలేకపోయారు..ఇన్నాళ్ళ తరువాత నిద్రలేచి నిందలు వేస్తారా అశోక్ గజపతి రాజు గారూ..' అంటూ వైసిపి చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. బుధవారం రాజమండ్రి నగరంలోని శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రం వద్ద మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఎంపీ భరత్ సమాధానాలు ఇచ్చారు. వైసిపి ఎంపీల పనితీరు బాగోలేదని అశోక్ గజపతి రాజు చేసిన వ్యాఖ్యలను ఎంపీ భరత్ దష్టికి పలువురు విలేకరులు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ

తీసుకువచ్చారు. దీనిపై ఘాటుగానే ఎంపీ భరత్ స్పందించారు. ఆనాడు ఎన్‌డిఎ ప్రభుత్వంలో అశోక గజపతి రాజు కేంద్ర మంత్రి కదా.. కేబినెట్‌లో ప్రత్యేక హోదా ఇవ్వం..స్పెషల్ ప్యాకేజీ ఇస్తాం అన్నప్పుడు ఈ మంత్రి గారు నిద్రపోయారా అని ప్రశ్నించారు. ఆ ముంపు మండలాలు ఇస్తేనే సిఎంగా ప్రమాణం చేస్తానన్న చంద్రబాబు ఆనాడు ఎపికి ప్రత్యేక హోదా ఇస్తేనే సిఎంగా ప్రమాణం, సంతకం చేస్తానంటే అప్పుడే వచ్చేది కదా' అన్నారు. టిడిపి చంద్రబాబు వల్ల ఈ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఆనాడే ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఎన్‌డిఎ నుండి బయటకు వస్తే.. రాష్ట్రానికి ఈ ఖర్మ ఉండేది కాదన్నారు. తాము అప్పటి టిడిపి ఎంపీల్లా సన్నాయి నొక్కులు నొక్కడం లేదని, అవకాశం వచ్చినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వాన్ని మొహమాటం లేకుండా నిలదీస్తూనే ఉన్నామన్నారు.

'ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్న ఉత్తర కుమారుడు లోకేష్ నీ భాష ఏంటో, నీ బాధ ఏంటో మాకు సరే..నీ కూడా తిరిగే వారికే అర్థం కాదు' న్నారు. యువగళమా అది గందరగోళమో అర్థం కావడం లేదన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పెదపూడి

అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు బాధిత కుటుంబాలను ఎంఎల్ఎ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా వర్తించే అన్ని సౌకర్యాలు, పథకాలు వెంటనే అందించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వైసిపి నాయకులు సమకూర్చిన రూ.20వేల నగదు, 50 కేజీల బియ్యం, ప్రభుత్వ పరంగా మరో 30 కేజీల బియ్యాన్ని ఎంఎల్ఎ బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి, జెడ్‌పిటిసి సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపిటిసి సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, బిసి సెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు. పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న ఎంఎల్ఎ



ఉల్లి కషాయం తయారు చేస్తున్న సిబ్బంది

పంట తెగుళ్లకు ఉల్లి కషాయం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వరి పంటల నాశించే క్రిమి కీటకాలను, తెగుళ్లను నివారించడంలో ఉల్లి కషాయం సంజీవినిలా పని చేస్తుందని ప్రకతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరావు అన్నారు. ఏలేశ్వరం శివారు అప్పన్నపాలెం రైతుల ఆధ్వర్యంలో 500 లీటర్ల ఉల్లి కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేశారు. వార్డు కౌన్సిలర్ బ్యాంగిల్ వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు రైతులు ఉల్లి కషాయం తయారీలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ దాళ్వా పంటలకు అధికంగా తెగుళ్ల వచ్చే అవకాశం ఉందని, తక్కువ ధరకు రైతులు ఉల్లి కషాయాన్ని తయారుచేసి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది ముదర ఏసుబాబు, ఎస్.సత్యవేణి, కొండేటి రాజారత్నం, బుగత అరుణ, నాగలక్ష్మి ఉన్నారు.

కల్వరి చర్చిలో పలువురికి వైద్య సేవలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కట్టమూరు పుంతలోని కల్వరి మిరాకిల్ చర్చిలో బుధవారం క్రాప్స్ అధ్యక్షులు డాక్టర్ లంక పురుషోత్తం దాస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో కళ్లజోళ్లు ఏర్పాటుకు 23 మందిని, కంటి ఆపరేషన్లు చేసేందుకు 16 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో క్రాప్స్ సెక్రటరీ ఎం.సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ జి.సత్యానందం, జిల్లా జాయింట్ సెక్రటరీ డాక్టర్ సిబిఐ.సుకుమార్, కోశాధికారి కె.రాజారావు, మేరీ రాజకుమారి, కంటి వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

టిడిపి కార్యకర్తకు ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక 41వ డివిజన్ కోటిలింగాల పేటకు చెందిన టిడిపి కార్యకర్త శోభన బాబుకు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున బుధవారం ట్రై సైకిల్ అందచేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శోభన్‌బాబు తన కాలు కోల్పోయారు. స్థానిక టిడిపి నాయకుల ద్వారా విషయం తెలుసుకుని వాసు స్పందించి తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ట్రై సైకిల్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు తాము, తమ తెలుగుదేశం పార్టీ ఇలాగే అండగా నిలుస్తామన్నారు.

శిథిలావస్థకు తుల్యభాగ వంతెన

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం శివారు పేకేటిపాకల తుల్యభాగ మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాలువ అవతల గట్టున పశువుల ముకాములు ఉన్నాయని దీంతో నిత్యం రైతులు, పశుపోషకులు, కూలీలు ఈ వంతనపై రాకపోకలు సాగిస్తుంటామన్నారు. అంతేకాకుండా పశువులకు అనారోగ్యం, టీకాలు తదితర వాటి కోసం ఈ వంతుని మీదుగానే గ్రామం, తాపేశ్వరంలోని పశువైద్యశాలకు తీసుకు వెళ్లాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడం, రెండు వైపులా రక్షణ గోడలు లేకపోవడంతో మూగజీవాలతో పాటు, ప్రజలు తరచూ ప్రమాదాల గురవుతున్నారని వారు చెబుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న తుల్యభాగ వంతెన

ఇటీవల కాలంలో ఈ వంతెన నుంచి జారిపడి రెండు గేదెలు మృతి చెందాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గత కొద్ది రోజుల క్రితం పశువుల పాక దగ్ధం కావడంతో గేదె కాలిపోయిందని దానికి వైద్యం చేయించేందుకు తీసుకెళ్లిన ప్రైవేటు వైద్యులు ఈ వంతెన మీద నుండి జారిపొడి గాయాల పాలు అయ్యాడని పశు పోషకుడు చెబుతున్నాడు. ఇప్పటికైనా శిథిలావస్థ వంతెన చెంతనే నూతన వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

సోమిరెడ్డి మృతికి గన్ని సంతాపం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉషా ఆగ్రో ఏజన్సీస్ అధినేత కర్రి సోమిరెడ్డి మృతికి గుడా మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. సోమిరెడ్డి గన్నికి చిన్ననాటి స్నేహితుడు. సోమిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చదువుకునే రోజుల్లో వారి స్నేహాన్ని జ్ఞాపకం చేసుకుంటూ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎప్పుడు కనబడినా ఆప్యాయంగా పలకరించే స్నేహితుడు ఇక లేడన్న వార్త నమ్మలేకపోతున్నానని గన్ని ఆవేదన వ్యక్తం చేశారు. గన్ని వెంట గంగరాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవింద్, గన్ని స్నేహితుడు ఎన్‌సివిఎన్.ఆచారి ఉన్నారు.

జనసేన ఆధ్వర్యంలో సాయం

ప్రజాశక్తి-నల్లజర్ల

ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిర్వాసితులైన అల్లే గణేష్ కుటుంబానికి జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు ఆధ్వర్యంలో రూ.10వేల నగదు, 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ దేవరపల్లి మండల నాయకులు కాట్నం గణేష్, పొలిమాటి నాని, నల్లజర్ల నాయకులు చోడసాని బాపిరాజు, రుద్ర శ్రీను, ఉన్నమట్ల రామకృష్ణ, పిల్లి కాంతారావు, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, అయ్యవరం గ్రామ జేనసేన నాయకులు శివకృష్ణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న సువర్ణరాజు

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా వరప్రసాద్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా ఎన్నికైన బోణం సత్య వరప్రసాద్ ని బుధవారం ఆయన స్వగ్రహం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరద సత్తిబాబు, అనుపోజు భగవాన్,మానేపల్లి ప్రకాష్, కర్రీ నారాయణరావు, రాజు బ్రదర్స్, కొసనా చిన్న, వరద రవి, పెదపాటి సత్తిబాబు, ఎం. మణికంఠ, వరద శీను, తమిరి భరత్ తదితరులు పాల్గొన్నారు.



వరప్రసాద్‌ను సన్మానించిన సంఘ నాయకులు

ఆనందోత్సాహలతో హోలీ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో హోలి పండుగను బుధవారం ఆనందోత్సహాలతో ఘనంగా జరుపుకున్నారు .ఈ సందర్భంగా చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. చిన్నారులు రంగురంగులతో నీళ్ల చల్లుతూ కేరింతల కొట్టారు. హోలి శుభాకాంక్షలు తెలుపుకుంటు ఆనందాలు పంచుకున్నారు.

యానాం వార్తలు

నేడు పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు గురువారం లెఫ్టినెంట్ గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్ ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.11,600 కోట్లకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరు కానున్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఎఒ

హెల్తీ ఉమెన్-హెల్తీ ఇండియా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోలో హెల్తీ ఉమెన్ హెల్తీ ఇండియా సైకిల్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలన అధికారి మునిస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, స్టాఫ్ నర్సు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్ లు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ప్రాంతీయ పరిపాలన అధికారి మునిస్వామి అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా కషి చేయాలని కోరారు. ఈ సభలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రగతిని సాధించాలన్నారు. పుదుచ్చేరి ఎన్‌డిఎ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని, ప్రభుత్వం నుండి ఎలాంటి పథకాలు పొందని కుటుంబంలో 21 నుంచి 51 మధ్య వయసుగల మహిళలకు రూ.1000 ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రంగస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, ఎస్‌పి రఘునాయగన్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో స్థానిక బాలయోగి వారధి వద్ద వెలసిన దొడ్డి గంగమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆలయ ధర్మకర్తలు కోన రామచంద్రరావు భవానీ దేవి, సూరిబాబు సత్య చంద్రావతి దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రముఖ వాస్తు సిద్ధాంతి పెద్దింశెట్టి రామస్వామి, కోన అప్పారావు మాస్టారు ఆధ్వర్యంలో కోణంబట్ల శ్రీరామచంద్రమూర్తి శర్మ, సాయి సతీష్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యానాం కాపు సంఘం ప్రెసిడెంట్ కాటంశెట్టి వెంకట రామమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోన వివిహెచ్ సత్యనారాయణ (కొండబాబు), కవల గణపతిరావు, గొర్రెల శ్రీనివాస్, కోన సుబ్బారావు, వేగేశ్న భాస్కర్ రాజు పాల్గొన్నారు.

గ్రామపంచాయతి కార్యాలయము, తిమ్మాపురం

టెండరు నోటీసు

రిక.నెం. 07/2023 — తేది: 07-03-2023

కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామపంచాయతికి సంబంధించి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతి నిధులతో ఈ దిగువ ఉదహరించిన విధముగా కాంట్రాక్టు సిబ్బంది సేవలకు మరియు గ్రామపంచాయతికి అవసరమైన సామానులు సప్లయి చేయుటకు గాను సీల్డు టెండర్లు, ఈ దిగువ సంతకం చేసిన వారిచే గాని, లేదా వారి యొక్క అనుమతి పొందిన వారిచే గాని ది. 17-03-2023 శుక్రవారం మధ్యాహ్నం 12-00 గంటల వరకు తీసుకొనబడి అదేరోజు అనగా ది. 17-03-2023 మధ్యాహ్నం 2-00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. సీల్డు టెండర్లకు గాను తీయించవలసిన ధరావత్తు పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతి తిమ్మాపురం వారి పేరున చెల్లుబాటు అగు విధముగా డి.డి.లు/ M.R ద్వారా గాని చెల్లించి రశీదును టెండరు షెడ్యూలునకు జతపరచి సీల్డు కవరు ద్వారా టెండరు సమర్పించవలెను. టెండరు షెడ్యూల్స్ ది. 16-03-2023వ తేది సాయంత్రం 5-00 గంటల వరకు మాత్రమే ఇవ్వబడును. పై నిబంధనలు పాటించని టెండర్లు మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. టెండరు షెడ్యూలు రేటు, టెండరు షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలో వచ్చి తెలుసుకొనవలెను. గ్రామపంచాయతి నిధుల లభ్యతను బట్టి బిల్లులు చెల్లించబడును. మరియు ఎట్టి కారణము చూపకుండానే టెండర్లను వాయిదా వేయుటకు గాని, రద్దుపరచుటకు గాని పంచాయతి కార్యదర్శికి పూర్తి అధికారము కలదు.

వ. నెం.	ఆర్థిక సంవత్సరము	వివరములు	చెల్లించవలసిన టెండరు ధరావత్తు డి.డి. రూపంలో (ఒక్కింటికి)
1	01-04-2023 నుండి 31-03-2024 వరకు	శానిటరీ మేస్త్రీ (2)	100
2	01-04-2023 నుండి 31-03-2024 వరకు	PWS ఆపరేటర్ (2)	100
3	01-04-2023 నుండి 31-03-2024 వరకు	లైబ్రరి అటెండర్లు (1)	100
4	01-04-2023 నుండి 31-03-2024 వరకు	కంప్యూటర్ ఆపరేటర్ సేవలు (1)	100
5	01-04-2023 నుండి 31-03-2024 వరకు	బిల్లు కలెక్టర్ సేవలు (1)	100
6	01-04-2023 నుండి 31-03-2024 వరకు	కార్యాలయపు సేవలు (2)	100
7	01-04-2023 నుండి 31-03-2024 వరకు	పారిశుద్ధ్య పని స్వీపర్లు సేవలు (30)	100
8	01-04-2023 నుండి 31-03-2024 వరకు	ఎవెన్యూ వాచర్ సేవలు (1)	100
9	01-04-2023 నుండి 31-03-2024 వరకు	శ్మశాన వాటికలో వ్యక్తి సేవలు (1)	100
10	01-04-2023 నుండి 31-03-2024 వరకు	ఎలక్ట్రీషియన్ సేవలు (1)	100
11	01-04-2023 నుండి 31-03-2024 వరకు	ట్రాక్టర్ డ్రైవర్ సేవలు (2)	100
12	01-04-2023 నుండి 31-03-2024 వరకు	రక్షిత మంచినీరు సరఫరా విడిభాగములు సప్లయ్	500
13	01-04-2023 నుండి 31-03-2024 వరకు	పారిశుద్ధ్య పనిముట్ల సప్లయ్	500
14	01-04-2023 నుండి 31-03-2024 వరకు	పబ్లిక్ హెల్త్ కలరా మందులు (బ్లీచింగ్, ముగ్గు, ఫినాయిల్, దోమల మందులు వగైరా)	500
15	01-04-2023 నుండి 31-03-2024 వరకు	స్టేషనరీ, బుక్స్ అండ్ ఫారములు సప్లయ్ కొరకు	500
16	01-04-2023 నుండి 31-03-2024 వరకు	ఎలక్ట్రికల్ సామానులు, LED లైట్లు విడిభాగములు, LED లైట్లు ఫిట్టింగులు సప్లయ్	500
17	01-04-2023 నుండి 31-03-2024 వరకు	వీధి విద్యుత్ దీపములకు ఉన్న LED లైట్లకు టైమర్లు సప్లయ్ చేయుటకు, టైమర్లు అమర్చుటకు	500

సం/- **కె.శ్రీనివాసరావు**
పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతి తిమ్మాపురం
కాకినాడ రూరల్ మండలం